క్లుప్తంగా

చిరు వ్యాపారిపై దాడి

తుని: పట్టణంలోని జీఎస్టీ రోడ్డులో న్యూడిల్స్ బడ్డీ కొట్టు నిర్వహిస్తున్న షేక్ మదీనా వల్లీపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి గాయపరిచారని తుని రూరల్ ఎస్సై కృష్ణమాచారి తెలిపారు. మంగళవారం రాత్రి తుని నుంచి మండలంలోని తాళ్లూరు వెళుతున్న షేక్ మదీనావల్లీపై లెప్రసీ కాలనీ సమీపంలో ముగ్గురు వ్యక్తులు దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయని కుటుంబ సభ్యులు తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితుడు మదీనా వల్లీ తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కిర్లంపూడి: మండలంలోని పాతకృష్ణవరంలో వేంచేసిన మంటలమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. జగ్గంపేట, ఏలేశ్వరం, లింగంపర్తి, పోతులూరు గ్రామాలకు చెందిన భక్తులు ఆలయంలో లలితా సహస్రనామ పారాయణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు

కోటనందూరు: స్థానిక నాన్‌భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఫిజియోథెరపిస్టు టీఎస్ఎస్ సోమేశ్వరరావు విద్యార్థులతో పలు వ్యాయామాలు చేయించారు. చిన్నారుల ఆరోగ్యం, చేయించాల్సిన వ్యాయామాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ ఏవీఎస్ శ్రీనివాస్ పరిశీలించారు. హెచ్ఎం రామకృష్ణ, ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

రౌతులపూడి: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎల్‌హెచ్ డీపీఎం కేశవ్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయం వద్ద బుధవారం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి అధ్యక్షతన మండల మహిళా సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో డ్వాక్రా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలన్నారు. ఎప్పటికప్పుడు పొదుపును చెల్లిస్తూ సంఘాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. శ్రీనిధి, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ రుణాలు, వెలుగు రుణాలను సక్రమంగా చెల్లిస్తే తిరిగి రుణాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఎస్‌పీఓ ఏపీఎం సురేష్‌కుమార్, శ్రీనిధి ఏజీఎం చిట్టిబాబు, మండల వీఓఏలు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం

కిర్లంపూడి: మండలంలోని తామరాడ ప్రభుత్వోన్నత పాఠశాల సివిక్స్ ఉపాధ్యాయుడు (పీజీటీ)బావిశెట్టి లక్ష్మీనారాయణ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. దీంతో బుధవారం లక్ష్మీనారాయణ దంపతులను పాఠశాల హెచ్ఎం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక నాయకులు తుమ్మలపల్లి రమేష్, అనుకుల శ్రీకాంత్, పాఠశాల కమిటీ చైర్మన్ ఎలుబండి శ్రీను, పంచాది నానాజీ, ఎంపీటీసీ గోకేడ రాజా తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి అమానుషం

తుని/జగ్గంపేట/ప్రత్తిపాడు: జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి అమాయకులను పొట్టనపెట్టుకోవడం హేయమైన చర్య అని జనసేన పార్టీ తుని నియోజకవర్గ సమన్వయ కర్త చోడిశెట్టి గణేష్ ఖండించారు. ఉగ్రదాడికి నిరసనగా బుధవారం తుని తహసీల్దార్ కార్యాలయం నుంచి గొల్ల అప్పారావు సెంటర్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. జగ్గంపేట, ప్రత్తిపాడులోనూ కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా ఫిషర్‌మెన్ సొసైటీ ఎన్నికలు

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లిలో బుధవారం జరిగిన ఫిషర్‌మెన్ సొసైటీ ఎన్నికల ప్రశాంతంగా ముగిశాయి. కాకరపల్లి కామేశ్వరరావు ప్యానల్‌కు సంబంధించిన తొమ్మిది మంది డైరెక్టర్లు విజయం సాధించారు. గత ఎన్నికల్లోనూ కాకరపల్లి కామేశ్వరరావు ప్యానల్ విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో కౌంటింగ్ ఇరువర్గాల మధ్య హోరాహోరీగా సాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

రిటైర్డ్ టీచర్ అరుణకుమారికి సత్కారం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పాండవుల పాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు అరుణకుమారి ఉద్యోగ విరమణ చేశారు. ఈ మేరకు బుధవారం పాఠశాల ఆవరణలో సన్మాన సభ నిర్వహించారు. అరుణకుమారి దంపతులను ఎంఈఓ వి.రాజబాబు, ఎంఈఓ-2 వై.అచ్చిరాజుల చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు ఆమె అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కోడి శ్రీనివాస్‌రావు, యూటీఎఫ్ నాయకులు చక్కల గణేష్, రామలింగేశ్వరరావు, దొడ్డిపట్ల రాజుబాబు, సీఆర్పీ రాంజీ ప్రసాద్ పాల్గొన్నారు.

పదింతల ఆనందం

- టెన్త్ ఫలితాల్లో మెరిసిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- నియోజకవర్గంలో 81 శాతం ఉత్తీర్ణత
- ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనల వెల్లువ


ఎ.కొత్తపల్లిలో ప్రతిభ కనబరిచిన దివ్యను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయ సిబ్బంది


డి.సుబ్బలక్ష్మి (575)


యెద్దు బాల మురళీ (584)


బి.నవ్యశ్రీ హారిక (590)


కేవీ పృథ్వీనాయుడు (577)


పి.పావని (577)


కె.జీవిత దేవి (540)


వై.వెంకటరమ్య (578)


పి.తేజశ్రీనాగు (573)


జి.వీరశివ చైతన్య (573)


పేర్ల ప్రియదర్శిని


కర్రి యశ్వంత్ (567)


గాది విజయలక్ష్మి (567)


గాడె లావణ్య (561)


కొండి మణి లోకేష్ (578)


లంక పూర్ణిమ (581)


టి.పావనీ షణ్ముఖి (588)


ఎస్.లలిత (579)


సామ్యూల్ రాజు (579)

ఏలేశ్వరం: టెన్త్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు మండలాల్లో 81 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఏలేశ్వరం మండలంలో 980 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 842 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా 85 శాతం వచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో 684 మంది విద్యార్థులకు గాను 555 మంది (80 శాతం) ఉత్తీర్ణత సాధించారు. గురుకుల పాఠశాలలో 96 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రైవేట్ పాఠశాలల్లో 296 మంది విద్యార్థులకు గాను 287 మంది ఉత్తీర్ణత సాధించగా 95 శాతం వచ్చింది. ఏలేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన కేవీ పృథ్వీనాయుడు, పెద్దనాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పి.పావని 577 మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి శ్రీవిద్యా స్కూల్‌కు చెందిన వి.హారిప్రియ, శ్రీచైతన్య స్కూల్‌కు చెందిన కె.లూక్ వెస్లీ 591 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు.

తుని: పది పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారని మండల విద్యాశాఖ అధికారి పరవాడ గీతాదేవి తెలిపారు. బుధవారం విడుదల చేసినా ఫలితాల్లో మండల పరిధిలోని 21 పాఠశాలలకు సంబంధించి 1526 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 1265 మంది ఉత్తీర్ణత సాధించి, 83 శాతం మంది పాస్ అయ్యారన్నారు. ఇందులో ఈఎస్.రమాదేవి (584), సీహెచ్.నమిత (582), ఎ.వీఆర సంహిత (582), ఎస్‌వీఎస్ శ్రీలక్ష్మి (581) మార్కులు సాధించారన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలకు సంబంధించి 11 పాఠశాలలకు చెందిన 812 మంది పరీక్షకు హాజరు కాగా 786 మంది ఉత్తీర్ణత సాధించారు. బి.రేష్మా (596), సీహెచ్‌జే మణికంఠ(595) నారాయణ స్కూల్, ఒరుగంటి రేష్మా (595) శ్రీచైతన్య, ఎన్ఎన్వీ భాను తేజ(594) శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు.

తొండంగి: టెన్త్ పరీక్షల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఎ.కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు విజయకేతనం ఎగురవేశారు. మండల వ్యాప్తంగా వాకదారిపేట కేజీబీవీతో కలిపి మొత్తం 12 హైస్కూళ్లు ఉన్నాయి. దానవాయిపేట, బెండపూడి, తొండంగి, కొత్తపెరుమాళ్లపురం సెంటర్లలో 906 మంది టెన్త్ పరీక్షలు రాశారు. కాగా అత్యధికంగా ఎ.కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు తొగర పావని షణ్ముఖి 588 మార్కులతో మండలంలోని ప్రథమస్థానంలో నిలిచింది. ఇదే పాఠశాలకు చెందిన వి.దివ్య 585 మార్కులు, ఎస్.లలిత 579 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పరంగా చూస్తే వాకదారిపేట కేజీబీవీ 92 శాతం, ఎ.కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్ 91 శాతం ఉత్తీర్ణత సాధించాయి. దానవాయిపేట జెడ్పీ హైస్కూల్ 50 శాతం ఉత్తీర్ణత మాత్రమే సాధించింది. అత్యధిక మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన టి.పావని షణ్ముఖి, వి.దివ్య, ఎస్.లలితలను హెచ్ఎం ఎ.లక్ష్మీమాణిక్యం, ఎస్ఎంసీ చైర్మన్ తాటిపర్తి నాగమణి తదితరులు అభినందించారు.

గండేపల్లి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలో 85 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈఓ కేహెచ్ నాయక్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్‌కు చెందిన 522 మంది విద్యార్థులకు గాను 444 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రైవేటు స్కూల్ విద్యార్థిని బి.నవ్యశ్రీ హారిక 590, బి.అర్చన 575 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించినట్టు చెప్పారు. ప్రభుత్వ స్కూల్స్ విద్యార్థుల్లో కె.హాసిని 573 మార్కులతో మండలంలో ప్రథమస్థానంలో నిలిచినట్టు తెలియజేశారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

89.73 శాతం ఉత్తీర్ణత

కోటనందూరు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలో 89.73 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈఓ ఏవీఎస్ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. మండల పరిధిలోని ఆరు ప్రభుత్వ, నాలుగు ప్రైవేటు, కేజీబీవీ పాఠశాలల నుంచి 438 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 393 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. కోటనందూరు హైస్కూల్ విద్యార్థిని లంక పూర్ణిమ 581 మార్కులతో మండల టాపర్‌గా నిలవగా కేజీబీవీ విద్యార్థి అన్నంరెడ్డి అలేఖ్య 573 మార్కులతో రెండవ, బొద్దవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి పొన్నాడ భార్గవ్ 569 మార్కులతో తృతీయ స్థానం సాధించినట్లు వివరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంఈఓలు శ్రీనివాస్, రామశేఖర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ప్రత్తిపాడు మండలంలో 72 శాతం ఉత్తీర్ణత

ప్రత్తిపాడు: పదో తరగతి ఫలితాల్లో ప్రత్తిపాడు మండలం 84 శాతం ఉత్తీర్ణత సాధించింది. మండలంలోని ఎనిమిది ప్రభుత్వ పాఠశాలల నుంచి 627 మంది, ఐదు ప్రైవేటు పాఠశాలల నుంచి 216 మంది పరీక్షలకు హాజరుకాగా 664 మంది ఉత్తీర్ణులైనట్టు మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో బాలుర కంటే బాలికలే అధిక శాతం ఉత్తీర్ణులయ్యారు. బాలురు 58 శాతం, బాలికలు 76 శాతం పాస్ అయ్యారు. ధర్మవరం హైస్కూల్ 86 శాతం ఉత్తీర్ణతతో ప్రథమ స్థానంలో ఉండగా 63 శాతం ఉత్తీర్ణతతో చినశంకర్లపూడి హైస్కూల్ చివరిస్థానంలో నిలిచింది. కాగా ఐదు ప్రైవేటు పాఠశాలల నుంచి 627 మంది పరీక్షలకు హాజరుకాగా 456 మంది (72 శాతం) ఉత్తీర్ణత సాధించాయి. ధర్మవరం ఆదర్శ విద్యాలయం, ఒమ్మంగి శ్రీభారతి విద్యానికేతన్ పాఠశాలలు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాయి. ప్రభుత్వ పాఠశాలల స్థాయిలో ప్రత్తిపాడు హైస్కూల్ విద్యార్థి కొండి మణి లోకేష్ 600 మార్కులకు గానూ 578 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడు.

రౌతులపూడి మండలంలో 89.5 శాతం ఉత్తీర్ణత

రౌతులపూడి: పదో తరగతి పరీక్షల్లో మండలంలో 89.5 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈఓ-2 గాడి కొండబాబు బుధవారం తెలిపారు. మండల వ్యాప్తంగా 534 మంది పరీక్షలు రాయగా వీరిలో 478 మంది (89.5 శాతం)విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. రౌతులపూడి జెడ్పీ హైస్కూల్లో 184 మందికి 156 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. రౌతులపూడి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కర్రి యశ్వంత్ 567 మార్కులు, బలరామపురం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన గాది విజయలక్ష్మి 567 మార్కులు, గాడి లావణ్య 561 మార్కులు సాధించి మండలంలో టాపర్లుగా నిలిచారని అన్నారు.

జగ్గంపేట: పదో తరగతి ఫలితాల్లో జగ్గంపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థి అన్నదేవుల సామ్యూల్ రాజు 579 మార్కులతో మండల ఫస్ట్‌గా నిలిచాడు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 1124 మంది పరీక్షలకు హాజరు కాగా వారిలో 874 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 77.75 శాతం, ప్రైవేట్ పాఠశాలల్లో 92 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్టు మండల విద్యాశాఖాధికారి ఆర్.స్వామి తెలిపారు. జగ్గంపేటకు చెందిన ఎ.సామ్యూల్ 579, రాజపూడి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని డేగాల సుబ్బలక్ష్మి 575, మామిడాడ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి బి.గౌతమి 566 మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

గోకవరం మండలంలో 85 శాతం ఉత్తీర్ణత

గోకవరం: పదో తరగతి ఫలితాల్లో మండలంలో విద్యార్థులు 85 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈఓలు బి.గౌరమ్మ, సీహెచ్ చిమ్మరాజుదొర తెలిపారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 803 మంది విద్యార్థులకు 681 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఆరు జిల్లా పరిషత్ హైస్కూళ్లు, భూపతిపాలెం గురుకుల పాఠశాల, వీరలంకపల్లి వెలుగు బాలికల ఆశ్రమ పాఠశాలలు ఉన్నారు. మొత్తం 691 మంది పరీక్షలకు హాజరుకాగా 574 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. ప్రైవేటు పాఠశాల విద్యార్థులు 112 మందికి 107 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. కామరాజుపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన వై.వెంకటరమ్య 578 మార్కులతో ప్రథమ స్థానంలో, భూపతిపాలెం గురుకుల పాఠశాలకు చెందిన పి.తేజశ్రీనాగు, పి.మనోహర్ 573 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు.

పది ఫలితాల్లో శ్రీప్రకాష్ ప్రభంజనం


తుని శ్రీప్రకాష్‌లో ప్రతిభ చూపిన భాను తేజస్‌ను అభినందిస్తున్న నరసింహారావు

తుని: పది ఫలితాల్లో శ్రీప్రకాష్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ బుధవారం తెలిపారు. నందవరపు భాను తేజస్ (594/600), సామిరెడ్డి గీతిక (593/600), కడిమి అర్చన రేఖ (592/600), సకురు రుత్విక (592/600), మాదాన స్నేహిత్ (500/600) మార్కులు సాధించారన్నారు. 550కు పైగా 91 మంది, 500 మార్కులకు పైగా 155 మంది ప్రతిభ చూపారన్నారు. పదిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, ప్రధానోపాధ్యాయుడు డీవీ శ్రీనివాస్, సీతారాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

శంఖవరం: పదో తరగతి ఫలితాల్లో మండల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మండలంలోని కత్తిపూడి, శంఖవరం, జి.కొత్తపల్లి, అన్నవరం, నెల్లిపూడి, మండపం గ్రామాల్లోని జెడ్పీ హైస్కూళ్లకు సంబంధించి 736 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 583 మంది (79 శాతం)ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ ఎస్‌వీ రమణ తెలిపారు. మండలంలోని 10 ప్రభుత్వ పాఠశాల్లో ఆదర్శ పాఠశాల 95 శాతం ఉత్తీర్ణతతో ప్రథమ స్థానంలో నిలించింది. ఆదర్శ పాఠశాల విద్యార్థి యెద్దు బాలమురళీ 584 మార్కులతో ప్రథమ స్థానం సాధించాడు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

కిర్లంపూడి: పదో తరగతి ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలకు చెందిన ఉమ్మిడిశెట్టి సాయికిరణ్ 579, పేర్ల ప్రియదర్శిని 579, గుత్తి మోహన్ వీర శివ చైతన్య 573, వీరవరం జెడ్పీ హెచ్ఎస్‌కు చెందిన గెద్దం ప్రేమసుందర్ 573, సింహాద్రిపురం హైస్కూల్‌కు చెందిన కాలపురెడ్డి హరినాగ చక్రవేణి 569 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు టి.జోసెఫ్, ఎం.చిన్నారావు మాట్లాడుతూ మండలంలోని 8 ప్రభుత్వోన్నత పాఠశాలల్లో చదువుతున్న 710 పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 520 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు.

దేవస్థానం హైస్కూల్‌లో 96 శాతం ఉత్తీర్ణత

అన్నవరం: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో స్థానిక శ్రీసత్యదేవ సంస్కృతోన్నత పాఠశాల విద్యార్థులు 96 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 25 మంది పరీక్షకు హాజరు కాగా 24 మంది ఉత్తీర్ణత సాధించారు. 540 మార్కులతో కె.జీవిత దేవి స్కూల్ ఫస్ట్ వచ్చింది. 498 మార్కులతో పి.లోహిత ద్వితీయస్థానం, 469 మార్కులతో పంచదార్ల అపర్ణ తృతీయ స్థానం పొందినట్లు స్కూల్ హెచ్ఎం అల్లాడ వేంకటేశ్వరరావు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

పంపా, పుష్కర కాలువ ఆధునీకరణకు చర్యలు


తేటగుంటలో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడుతో చర్చిస్తున్న మంత్రి రామానాయుడు

తుని: పోలవరం ఎడమ కాలువ పనులను 2025 జూన్ నాటికి పూర్తి చేస్తామని నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. తుని మండలం తేటగుంట టీడీపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం మాజీ మంత్రి, టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడుతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ కుచ్చర్లపాటి రూపాదేవి, ఇతర నాయకులు పంపా, పుష్కర కాలువల ఆధునీకరణ, కల్వర్టులు నిర్మాణం, తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి ఇరిగేషన్ అధికారుల నుంచి వీటికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

తమ్మన్నదొరకు పరామర్శ


దాసరి తమ్మన్నదొరను పరామర్శిస్తున్న తోట నరసింహం

గోకవరం: సతీ వియోగంతో బాధపడుతున్న గోకవరం సొసైటీ మాజీ చైర్మన్ దాసరి తమ్మన్నదొరను వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం బుధవారం పరామర్శించారు. తమ్మన్నదొర సతీమణి భాస్కర రామామణి ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న తోట నరసింహం పార్టీ శ్రేణులతో కలిసి ఆయనను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే ఇటీవల మృతి చెందిన కొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి చెదల చిన్నారెడ్డి సతీమణి రమణకుమారిని పరామర్శించి తన సంతాపం తెలిపారు. ఆయన వెంట పార్టీ యువ నాయకుడు తోట రాంజీ, స్థానిక నాయకులు దాసరి చినబాబు, సుంకర వీరబాబు, గుల్లా ఏడుకొండలు, కర్రి సూరారెడ్డి, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, సమ్మెటి నాని, బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి) తదితరులు ఉన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన


పెద్దనాపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తెలిపారు. మండలంలోని పెద్దనాపల్లిలో బుధవారం ఎమ్మెల్యే, మండల నిధులు రూ.30 లక్షలతో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పెద్దనాపల్లిలో గుబ్బాలమ్మ, సత్తెమ్మ తల్లి ఆలయాల అభివృద్ధికి రూ.7 లక్షలు, ఎస్సీపేటలో 33 కేవీ విద్యుత్ లైన్ మార్పు, గ్రావెల్ రోడ్డు, నూతన స్తంభాల ఏర్పాటుకు రూ.10 లక్షలు, అంగన్‌వాడీ భవనాల్లో రూ.10 లక్షలతో నిర్మాణాలు చేపడుతున్నట్టు చెప్పారు. రూ.30 లక్షలతో పెద్దనాపల్లి నుంచి చిన్నింపేట వరకు రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. అలాగే పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, ట్రాన్స్‌కో ఏఈ సూర్యనారాయణ, సుంకర సత్తిబాబు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: స్థానిక వీరవరపుపేట సబ్‌స్టేషన్‌లో విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు బుధవారం తెలిపారు. వీరవరపుపేట, కొబ్బరితోట, కొత్త సూరవరం, రామకృష్ణాకాలనీ, గవరపేట, ఉప్పరగూడెం తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని ఆయన కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట నరసింహం


వీరవరంలో తోటను కలసిన కాంద్రేగుల గామ నూతన కమిటీ సభ్యులు

కిర్లంపూడి: పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట నరసింహం సూచించారు. వీరవరంలోని తోట నరసింహం నివాసంలో ఆయనతో పాటు యువ నాయకుడు తోట రాంజీని కాంద్రేగుల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తోట నరసింహం ఆదేశాలతో ఇటీవల కాంద్రేగుల గ్రామానికి నూతన కమిటీని ఏర్పాటు చేశారు. దీంతో వైఎస్సార్ సీపీ నేత వరుపుల సూరిబాబు ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు నరసింహాన్ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రెసిడెంట్‌గా నియమితులైన తుంపాల వీరరాఘవులును తోట నరసింహం, రాంజీ పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ జనరల్ సెక్రటరీలు పోసుపోయిన వీరబాబు, ద్వారపూడి శివనారాయణమూర్తి, వరుపుల వెంకట వీరబాబు, బొదిరెడ్డి రాజేష్, సెక్రటరీలు తుంపాల వీరనాగేశ్వరరావు, వర్రె అర్జునరావు, కర్నాకుల వెంకట్రావు, సంకుమళ్ల వీరబాబు తదితరులు ఉన్నారు.

సుబ్బారెడ్డి సాగర్‌ను ఆధునీకరించాలని వినతి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఇ.గోకవరంలో మధ్య తరహా సాగునీటి జలాశయం సుబ్బారెడ్డి సాగర్‌ను ఆధునీకరించాలని ఆ ప్రాజెక్టు సాగునీటి సంఘం అధ్యక్షుడు ఇళ్ల అప్పారావు కోరారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి వినతి పత్రాన్ని అందజేశారు. పోలవరం ప్రాజెక్టు అభివృద్ధి పనులను పరిశీలించేందుకు అన్నవరం వచ్చిన మంత్రికి సమస్యను వివరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు యాళ్ల జగదీష్, అమరాధి వెంకట్రావు, సత్యంశెట్టి సీతబాబు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

గండేపల్లి: మండలంలోని యర్రంపాలెంలో పోషణ్ పఖ్వాడ్‌పై ఆదిత్య యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. విద్యార్థులకు సి విటమిన్, బూస్ట్ ప్యాకెట్స్, వేరుశనగ చెక్కీలు, ఎనర్జీ డ్రింక్స్‌ను ఉచితంగా అందజేశారు.

ముగిసిన ఆన్‌లైన్ కోర్స్

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ, భారత ప్రభుత్వ షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సముద్ర నౌకా నిర్మాణంలో ఆన్‌లైన్ ద్వారా నెల రోజులపాటు నిర్వహించిన వాల్యూ యాడెడ్ కోర్స్ బుధవారంతో ముగిసినట్టు ప్రో చాన్సలర్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు.

'బార్' నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రత్తిపాడు కోర్టు న్యాయమూర్తి కాటం భాను సమక్షంలో బాధ్యతలు చేపట్టిన బార్ నూతన కార్యవర్గం

ప్రత్తిపాడు: స్థానిక కోర్టు హాలులో జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు కోర్టు న్యాయమూర్తి కాటం భాను సమక్షంలో సీనియర్ న్యాయవాది కొల్లా వీర్రాజు ఎంపికైన నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. బార్ అధ్యక్షుడిగా రాజాల చిట్టిబాబు, ఉపాధ్యక్షుడిగా కలిశెట్టి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా సోము గౌరీ శంకర్, సహాయ కార్యదర్శిగా గెద్దం కామేశ్వరరావు, కోశాధికారిగా పలివెల నాగేంద్రరాజు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా ఎంఎస్ఎల్ఎస్ భారతి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు, గుమస్తాలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరం ఏలేరు కాలువలో బుధవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. వివరాల్లోకి వెళితే... ఏలేరు కాలువలో మృతదేహం ఉన్నట్టుగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పొద్దుపోవడంతో మృత దేహాన్ని పరిశీలించడం కష్టంగా మారింది. మహిళ మృతదేహమై ఉంటుందని సుమారు 60 ఏళ్లపైనే ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. పోలీసులు మృతదేహాన్ని గుర్తించేందుకు దర్యాప్తు ప్రారంభించారు.

1400 మట్టి నమూనాల సేకరణే లక్ష్యం

గోకవరం: మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌కు 1400 మట్టి నమూనాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మండల వ్యవసాయశాఖ అధికారి పి.రాజేశ్వరి బుధవారం తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న మట్టి నమూనాల సేకరణను బుధవారం ఏఓ పర్యవేక్షించారు. ఏఓ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రైతులు తమ పంట పొలాల్లో గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులతో మట్టినమూనాలు సేకరించి సెల్ఫీలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఆ వివరాలు ఎప్పటికప్పుడు మట్టి పరీక్ష కేంద్రానికి పంపిస్తామన్నారు. పంట పొలాల్లో పోషకాల శాతం, ఎంత మోతాదులో ఎరువులు వాడాలి వంటి వివరాలతో కూడిన పత్రాలు రైతులకు అందజేస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.